ఇసుక అక్రమ రవాణాకు జీపీ రశీదు

- మదనతుర్తి పంచాయతీ కార్యదర్శి నిర్వాకం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నెల్లికుదురు, జూన్ 9: ఇసుక రవాణాను రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిషేదించింది. కానీ మండలంలోని మదనతుర్తి వద్ద ఆకేరువాగు నుంచి ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. దీనికి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రత్యేకంగా పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేసి ఇసుక తరలిస్తున్న ప్రతి ట్రాక్టర్ వద్ద రూ.200 వసూలు చేసి రశీదు ఇవ్వడమే నిదర్శనం. సోమవారం కొందరు 'మిమ్మల్ని ఎవరు డబ్బులు వసూలు చేయమన్నారు?' అని వారిని ప్రశ్నించగా పంచాయతీ కార్యదర్శి చెప్పాడని సమాధానం ఇచ్చారు. వాస్తవానికి అనుమతి పత్రాలు కలిగి, గ్రామం నుంచి ఇసుక రవాణా చేస్తే గ్రామాభివృద్ధికి అందరి తీర్మానంతో ప్రతి ట్రాక్టర్ నుంచి డబ్బులు వసూలు చేసి రశీదు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అనుమతి లేని ఇసుక రవాణాకు గ్రామపంచాయతీ నుంచి డబ్బులు వసూలు చేస్తూ రశీదు ఇస్తున్నారు. ఇది ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహించడమే అవుతుందని, ఇది శాఖ పరంగా విరుద్ధమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే మురళీనాయక్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 9: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని, అన్ని డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వాలని ఆదేశించారు. కొందరు అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తున్నారని, పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలోనూ ప్రభుత్వ భూముల్లో ఇంటి అనుమతులు ఇచ్చారని, వాటిపై పూర్తిగా పరిశీలన చేయాలని ఆదేశించారు. గ్రీన్‌లాండ్స్ ఆక్రమించుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో డ్రైనేజీ, వీధిలైట్లు సమస్యలు ఉన్నాయని అధికారులు పరిశీలించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, డీఈ ఉపేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన రైతులు

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట గిరిజన రైతుల నిరసన

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : తమ భూములను కబ్జా చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు బోడ రమేశ్‌నాయక్, భూక్యా శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట పలువురు గిరిజన రైతులు నిరసన తెలిపి, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల శివారులోని శనిగపురం రోడ్‌లో 275, 279 సర్వే నంబర్‌లోని 30 ఎకరాల తమ భూమిని అగ్రవర్ణానికి చెందిన కొందరు ఆక్రమించారని తెలిపారు. అందులో అనేక భవనాలు నిర్మించారని, ఇప్పుడు రెవెన్యూ, మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఓ స్కూల్ పేరుతో భవనాలు నిర్మించి విద్యాశాఖ నుంచి పర్మిషన్ లేకుండానే స్కూల్ ప్రారంభించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు పర్మిషన్ లేని స్కూల్‌ను రద్దు చేయాలని, పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీనాయక్, లాల్‌సింగ్, రవీందర్‌నాయక్, మల్సూర్, సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : ఆర్టీసీ మానుకోట డిపో నుంచి వివిధ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, నాగార్జునసాగర్, శ్రీశైలం, కొండగట్టు వంటి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీల్లో బస్సు సౌకర్యం ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

జ్యోతిష్యం చెప్పబడును
★ శ్రీమేడారం ఓంశక్తి జ్యోతిషాలయం. విద్య, ఉద్యోగం, విదేశీప్రయాణం, వ్యాపారం, నాగదోషము, నరగోశ ప్రేమించుకున్న వారు దూరం అవటం, ఎన్ని సంబంధాలు వచ్చినా పెళ్లి కుదరకపోవడం, సంతానం లేకపోవడం, భార్య, భర్తల మధ్య కలహాలు రావటం మరియు ఎటువంటి సమస్యలకైన శాశ్వత పరిష్కారం 3 రోజులలో 100% చేయబడును. అన్ని మతాల వారికి జ్యోతిష్యం చెప్పబడును. గురూజీ కోయరాజు : రాజు గారు. సంప్ర: సెల్: 9912280354.
NTW-337017

CHANGE OF NAME
I, THURPATI RAJU S/o SAMMAIAH, R/o H. No. 1-9/2, Tekumatla Village & Mandal, Jayashankar Bhupalpally district. I have changed my daughter name from THURPATI AMMULU to THURPATI SATHWIKA for all Purposes.

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

WANTED
jobs Apply Now!
★హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పనిచేయుటకు కార్ ఎల్క్ట్రిషన్స్, సూపర్‌వైజర్స్ (Female) మరియు కార్ వాషింగ్ చేయుటకు Male/Female వర్కర్స్ కావలెను. సెల్: 7995621165, 6303776310.
NTW-307

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మహబూబాబాద్ రూరల్: విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లికుదురు: రామన్నగూడెంలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

నర్సింహులపేట: కొమ్ములవంచలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- హెచ్ఎంలు, ఎంఈవోలు, తహసీల్దార్లు
- బడిబాట కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం

ఇనుగుర్తి : బడిబాటలో అవగాహన కల్పిస్తున్న టీచర్లు

మహబూబాబాద్ రూరల్/ నెల్లికుదురు/చిన్నగూడూరు/ మరిపెడ/ నర్సింహులపేట/ ఇనుగుర్తి/ డోర్నకల్, జూన్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మహబూబాబాద్ మండలం లక్ష్మాతండా, బోడగుట్ట తండా, కంబాలబండా తండా, సాదు తండాల్లో బడిబాట నిర్వహించగా, పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ మందుల శ్రీరాములు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఉచిత యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, ఇతర అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రవి, గీత, ప్రేమ్‌కుమార్, ప్రభాకర్, రామాచారి, కృష్ణ, రాజేశ్ పాల్గొన్నారు. నెల్లికుదురు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో నిర్వహించిన బడిబాటలో రామన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం మచ్చ సోమయ్య మాట్లాడారు. బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ప్రభుత్వ ఉచిత సౌకర్యాలు పొందాలన్నారు. రామన్నగూడెంలో నలుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బీ బుచ్చిరామయ్య, వెంకటేశ్వర్లు, దాసరి యాదగిరి, ఎం.సునిల్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు స్వరూపరాణి, ఆయా సారమ్మ పాల్గొన్నారు. చిన్నగూడూరు హైస్కూల్ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించగా, ఎంఈఓ రవికుమార్, ఉపాధ్యాయులు సతీశ్‌రెడ్డి, వెంకట్రాంనర్సయ్య, వెంకన్న, నాగేశ్వర్, ప్రసాద్, అబ్దుల్లా, రమేశ్ ఉన్నారు. మరిపెడ మండలం వీరారంలో బడిబాటలో సీతారాంపురం హెచ్ఎం గుగులోత్ అర్జున్ మాట్లాడారు. ఉచితంగా ఆంగ్ల బోధన, పాఠ్యపుస్తకాలు, యునిఫాం, మధ్యాహ్నభోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు లింగాల మహేశ్, వెంకటేశ్వర్‌రావు, సందీప్‌కుమార్, ఆదిలక్ష్మి ఉన్నారు. నర్సింహులపేట మండలంలోని పలు గ్రామాల్లో, తండాల్లో ఉపాధ్యాయులు బడిబాటలో ఇంటింటా ప్రచారం చేశారు. నర్సింహులపేట ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఇనుగుర్తి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధి ముకుంద, మంగళి తండాల్లో టీచర్లు ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కుండె చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. సుమారు 15 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు నాగనబోయిన రాజశేఖర్, గ్రామ కార్యదర్శి నూనావత్ నరేశ్, కారోబార్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ సుకన్య, ఆశా కార్యకర్త సంతోష పాల్గొన్నారు. మన్నెగూడెం జడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో సీరోలు మండలం అందనాలపాడులో బడిబాట నిర్వహించారు. సీరోలు తహసీల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం, డిజిటల్ టీవీ ద్వారా విద్య బోధించనున్నట్లు తెలిపారు. హెచ్ఎం విత్తనాల సుధాకర్ పాల్గొన్నారు.

డోర్నకల్: బడిబాటలో సీరోలు తహసీల్దార్ పున్నంచందర్, హెచ్ఎం విత్తనాల సుధాకర్

మరిపెడ: బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

డోర్నకల్/ గార్ల/ బయ్యారం/ చిన్నగూడూరు, జూన్ 9: రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం డోర్నకల్ మండలం గొల్లచర్ల, గార్ల మండలం ముల్కనూర్, బయ్యారం మండలం కొత్తపేట, జగత్‌రావు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను కలెక్టర్ తనిఖీ చేశారు. దరఖాస్తులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సదస్సులు ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయని, భూ సమస్యలు ఉన్న రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీటీ వీరన్న, గార్ల తహసీల్దార్ శారద, డీటీ సంజీవ, బయ్యారం తహసీల్దార్ నాగరాజు, చిన్నగూడూరు తహసీల్దార్ మహబూబ్‌అలీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



డోర్నకల్: గొల్లచర్లలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

టౌన్ సీఐ దేవేందర్ బదిలీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న దేవేందర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పాలకుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జీ మహేందర్‌రెడ్డిని బదిలీ అయ్యారు. ఈమేరకు మల్టీజోన్ ఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు

కొత్తగూడ, జూన్ 9: ఓ మహిళ, అతడి భర్తపై దాడిచేసిన ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు గూడూరు సీఐ సూర్యప్రకాశ్, కొత్తగూడ ఎస్సై కుశకుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాదిరెడ్డిపల్లికి చెందిన మహిళ, అతడి భర్తపై ఆదివారం ఎంచగూడెంకు చెందిన తరాల అనిల్, అతడి బావ రెడ్యాలకు చెందిన ఒగ్గ దేవేందర్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడి చేసిన యువకులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాపర్ వైర్ చోరీ చేసిన ఐదుగురిపై..

నెల్లికుదురు, జూన్ 9: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరును చోరీ కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు సోమవారం తెలిపారు. మండలంలోని రావిరాల శివారు, చుట్టుపక్కల మండలాలైన నర్సింహులపేట, తొర్రూరు, సీరోలు, మరిపెడ, మహబూబాబాద్ మండలాల్లో వివిధ గ్రామాల్లో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌వైర్ బొల్లంకొండ సమ్మయ్య, స్నేహితులు శివ, కార్తీక్, వెంకటేశ్ చోరీ చేయగా, ఆ వైరు కొనుగోలు చేసిన అద్దంకి రాములుపై కేసు నమోదు చేశారు. ఏ-1 ముద్దాయిగా ఉన్న బొల్లకొండ సమ్మయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మిగిలిన నలుగురు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

రైతుకు పాము కాటు

డోర్నకల్, జూన్ 9: పొలం పనులు చేస్తుండగా ఓ రైతు పాముకాటుకు గురయ్యాడు. ఈ ఘటన చాప్లతండాలో సోమవారం జరిగింది. తండాకు చెందిన రైతు అజ్మీరా హట్య వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆటోలో డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

ఆకేరులో పడి మహిళ మృతి

రచ్చ పద్మ(ఫైల్)

చిన్నగూడూరు, జూన్ 9: ఆకేరు వాగులో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన రచ్చ పద్మ(48), భర్త ధర్మేశ్ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. రెండు రోజుల క్రితం భర్తతో కలిసి పద్మ పుట్టిన ఊరైన చిన్నగూడూరుకు వచ్చారు. ఆమె మానసిక స్థితి బాగాలేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి సమీపంలోని ఆకేరులో పడి నీటిలో మునిగి మృతిచెందింది. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమెకు కుమారుడు, కుమార్తె, భర్త ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు శవపంచనామా చేసి పోస్ట్‌మార్టం కోసం జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

బిర్సాముండా స్ఫూర్తితో ఉద్యమించాలి

నివాళులు అర్పిస్తున్న గుగులోత్ కిషన్‌నాయక్, ప్రజా సంఘాల నాయకులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : ఆదివాసీ పోరాట యోధుడు బిర్సాముండా స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల సాధనకు ఉద్యమించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బిర్సాముండా వర్ధంతి సందర్భంగా చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా బ్రిటీష్ వలసపాలకులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు బిర్సాముండా అని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి పోరాటం చేశాడని పేర్కొన్నారు. రవికుమార్, దేవేందర్, హరినాయక్, భీమానాయక్, రామ్మూర్తి, మంద శశికుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీ వంట సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది

తొర్రూరు, జూన్ 9: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) వంట సిబ్బందికి జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఆమె మాట్లాడుతూ మెనూలో భాగంగా ఎగ్ బూజి, పకోడీ, మిల్ మేకర్, వడ వంటి పౌష్టికాహార వంటకాల తయారీపై సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎంఈఓ బుచ్చయ్య, జీసీడీవో విజయకుమారి, స్పెషల్ ఆఫీసర్ శైలజ, డీఆర్‌పీలు సుహాసిని, మంజుల, రజిని పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి సైదులు, నాయకులు

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

నెల్లికుదురు, జూన్ 9 : ప్రభుత్వ భూమిని దళారులు ఆక్రమించుకున్నారని, వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో దళారులు పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని పట్టాలు చేయించుకున్నారని, ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. మండలంలో చెరువు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను ఇండ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఆ పార్టీ నాయకులు మచ్చ వెంకన్న, భూక్య భిక్షపతి, సత్యనారాయణ, యాకుబ్, ఉప్పలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

నెల్లికుదురు, జూన్ 9: నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే ఆయా డీలర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఏఐకేఎంఎస్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఇరుగు నాగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం పంటల సీజన్ ప్రారంభమైనందున విత్తనాలు సకాలంలో అందించి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. నకిలీ విత్తనాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా విత్తనాలను అందివ్వాలని, బీసీలకు 50శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్ నివారించాలన్నారు. ఎలాంటి షరతులు విధించకుండా రైతులకు కొత్త రుణాలను ఇవ్వాలని కోరారు. ఇరుగు అనిల్, గుగులోత్ కనుకు, బొంతల సోమయ్య, రాజు, లక్ష్మీ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం ఇచ్చినందున సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రూనాయక్

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ మండలాల ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అధికారులు వారి పరిధిలో దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కార మార్గం చూపాలన్నారు. రెవెన్యూ శాఖ 33, పోలీస్ శాఖ 9, మండల ప్రజా పరిషత్ 4, హౌసింగ్ 4, మున్సిపాలిటీకి 5 మొత్తం వివిధ శాఖలు కలిసి 87 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. జడ్పీ సీఈవో పురుషోత్తం పాల్గొన్నారు.

రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి

కేసముద్రం, జూన్ 9: ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. కేఎం 416/20-22 డౌన్‌లైన్ ఇంటి కన్నె - కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. క్రీమ్ కలర్ 3/4 షర్టు, నేవీ బ్లూ కలర్ టీ-షర్టు ధరించి ఉన్నాడని, చాతిపై కుడి పక్క పుట్టుమచ్చ ఉందని, దానాపూర్ నుంచి పెరంబుర్ వరకు రైల్వే వెయిటింగ్ లిస్ట్ టికెట్ కలిగి ఉన్నట్లు విరించారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9849749220, 87126 58585 నంబర్లను సంప్రదించాలని కోరారు?

ఈదులపూసపల్లిలో ఘనంగా ఉర్సు

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : మండలంలోని ఈదులపూసపల్లిలో హజరత్ సయ్యద్ ఇమాం షావలి దర్గాలో సోమవారం ఉర్సు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీనాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భూక్య ఉమ, పట్టణవాసులు, మత పెద్దలు పాల్గొన్నారు.

కారు పల్టీ.. తప్పిన ప్రమాదం

పల్టీ కొట్టిన కారు

దంతాలపల్లి, జూన్ 9: రోడ్డుపై కారు పల్టీ కొట్టిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి నర్సింహులపేట స్టేజీ వంతడపులకు వెళ్తున్న కారు దంతాలపల్లి శివారులో వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారిపై గుంతను గమనించి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో రోడ్డుపై పల్టీ కొట్టింది. కారులో ఉన్న పాసం శ్రీకాంత్‌తోపాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయట పడగా పెను ప్రమాదం తప్పింది.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

తొర్రూరు, జూన్ 9: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన డీ రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, 1996-1997లో అతడితో కలిసి పదోతరగతి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. తలాకొంత వేసుకొని సుమారుగా రూ.30వేలు సోమవారం అందజేశారు. పలువురు పదో తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొని, మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

టీబీ వ్యాధి పరీక్షలు

గార్ల, జూన్ 9: మండలంలోని కోట్యానాయక్ తండా, రాంపురం గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముల్కనూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శివ కుమార్, ఎంపీడీవో మంగమ్మ, డాక్టర్ హనుమంతరావు, సూపర్‌వైజర్ ఇస్మాయిల్ భేగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జయ్యారంలో గంగమ్మతల్లి వేడుకలు

చిన్నగూడూరు, జూన్ 9: మండలంలోని జయ్యారంలో యాదవ కులస్తులు తమ కులదైవం గంగమ్మతల్లి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి గంపలు, బోనాలతో తరలి మొక్కులు చెల్లించారు. యాదవ కులస్తులు ప్రత్యేక పూజలు చేశారు. వారం రోజులుగా కొనసాగుతున్న వేడుకల తర్వాత సోమవారం యాటలు కోసి, బంధువులు, స్నేహితులతో సహ పంక్తి భోజనాలు చేశారు. ఐదేళ్లకోసారి ఇలా గంగమ్మ తల్లి వేడుకలు నిర్వహిస్తే పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, తాము సుఖశాంతులతో ఉంటామని నమ్ముతారు. యాదవ స